# భగవన్నామమే నావ

**భావసంశుద్ధి కలుగుటె భక్తియనగ**
**పరుల కుపకారకార్యమే పరమ తపము**
**పుణ్యకార్యాలు చేయుటే పూజలనగ**
**మూడుగుణములుగలమూర్తి బలిచక్రవర్తి.**

**ప్రేమస్వరూపులారా!**

భక్తి అనగా త్రిమూర్తి స్వరూపాన్ని, త్రిగుణములయొక్క పరిపూర్ణమును పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టి దివ్యత్వముతో సన్నిహిత సంబంధ బాంధవ్యమును కల్గించుకొనుటయే. త్రికరణశుద్ధితో భగవంతుని స్నేహమభివృద్ధి పరచుకొనుటయే భక్తి. భక్తి మూడు విధములు. సామాన్యభక్తి, ఏకాంత భక్తి, అనన్య భక్తి.

సామాన్య భక్తి అనగా

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం స్నేహ మాత్మనివేదనం**

మొదటిది శ్రవణము. తన ఒళ్లు, ఇల్లు మరచి మృత్యువును ముందుంచుకొని ఏడు దినములు ఏకాగ్రతతో భగవచ్చింతన సలిపినవాడు పరీక్షిత్ మహారాజు. తాను రాజై ఉండినప్పటికినీ దివ్యమైన ఆత్మతత్వాన్ని పొందే నిమిత్తమై, దైవాత్వాన్ని అనుభవించి ఆనందించే నిమిత్తమై, ఏకాగ్ర చిత్తుడై తన రాజ్యమును, తన ఒళ్లు ఇల్లు మరచి ఏడు దినములు శ్రవణం గావించాడు. కేవలం శ్రవణం గావించినంతమాత్రమున చాలదు. శ్రవణం చేసినదానిని మననము చేయాలని మననము చేసినదానిని ఆచరణలో పెట్టాలి. దీనినే శ్రవణ మనన నిధిధ్యాస అనిచెప్పుతూ వచ్చారు. ఈ మూడింటియొక్క ఏకత్వమే దివ్యత్వం పొందుటకు రాజమార్గము.

srisathyasai vachanamrutam

శ్రవణ భావమును, శ్రవణ తత్త్వమును ప్రపంచమునకు చాటి చెప్పిన వ్యక్తి పరీక్షిత్ మహారాజు.

కీర్తనం, సర్వకాల సర్వావస్థలందు భగవన్నామ సంకీర్తన యావత్ ప్రపంచమునకే దివ్యమైన వాతావరణమును కల్పించిన వ్యక్తి బ్రహ్మ మానస పుత్రుడు నారదుడు. ఈ కీర్తన చేత జన్మను సార్థకము గావించుకొనుటకు సరైన వ్యవస్థను గావించినవ్యక్తి నారదమహర్షి. సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనం. విష్ణు నామ సంకీర్తనము చేత దివ్యత్వమును అనుభవించి సార్థకం గావించుకున్న వ్యక్తి నారుదుడు.

విష్ణుస్మరణం, నిరంతరము భగవంతుని చింతన గావించినటువంటి పరమ భక్తుడు ప్రహ్లాదుడు.

**తన్ను నిశాచరులు పొడవ దైత్యకుమారుడు మాటిమాటికిన్**
**పన్నగశాయి! యో దనుజ భంజన! యోజగదీశ! యోమహా**
**పన్నశరణ్యా! యోనిఖిలపావన యంచు నుతించుగాని తా**
**గన్నుల నీరు తేడు భయకంప సమేతుడు గాడు భూవరా!**

ప్రహ్లాదుడు పరమభక్తుడు. తండ్రి విష్ణుద్వేషి. అయినప్పటికి భగవత్ప్రీతి కలిగినటువంటి వ్యక్తి ఈప్రహ్లాదుడు. హరిప్రియుడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుని తత్త్వము మహాభారతము చక్కగా చాటుతూ వచ్చింది. ఈ పరమ భక్తుడైన ప్రహ్లాదుడు జగత్తునకు నామ చింతన మాత్రమే సార్థకమునకు మార్గమని ప్రబోధిస్తూ వచ్చాడు.

పాదసేవనం. సమస్త ఐశ్వర్యములు కలిగి, సమస్త భోగభాగ్యములకు నిలయమైన, సకలైశ్వర్య స్వరూపిణియైన లక్ష్మి. సిరిప్రధానము కాదు. హరి పాదసేవనమే ప్రధానమని లోకమునకు చాటి నిరంతరము హరిపాద సేవన మందే తాను అంకితము గావించుకుంది. ఈనాటి భక్తులు సిరిభక్తులుగా రూపొందు తున్నారేగాని హరి భక్తులుగా అభివృద్ధి కావటం లేదు. హరి పాదసేవనం చేత సిరికూడను లభ్యమవుతుందనే సత్యాన్ని గుర్తించుకోలేరు. కనుక మూఢ మానవులారా! సిరిని ఆశ్రయించి హరిని విస్మరించి దివ్యత్వమునకు దూరం కావటం మానవత్వమునకు సహజం కాదు. హరిపాద సేవయందు నీ జీవితమును అంకితము గావించుమని లక్ష్మిచాటుతూ వచ్చింది.

srisathyasaivachanamrutam

అక్రూరుడు నమస్కారమే సర్వస్వమునకు ఆస్కారమని కూడను ప్రబోధిస్తూ వచ్చాడు. నమస్కారమనగా అహంకారము వదలి కేవలం దివ్యత్వములో లీనమై సర్వము అర్పితము గావించటమే నమస్కారముయొక్క అంతరార్థము. ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు ఈ రెండింటిని చేర్చి దశేంద్రియముల చేత భగవంతునికి అంకితము కావటమే నమస్కారముయొక్క అంతరార్థము. బాహ్య దృష్టితో చూసినప్పుడు అన్నింటికి నమస్కారమంటుంటాం. కాదు కాదు. అంతర్భావము మనము చక్కగా విచారణ చేసినప్పుడు ఇందులో దివ్యమైన ఆత్మతత్త్వము అంకితమై ఉంటున్నాది. నమస్కారము ఈ ఐదింటిని చేరి ఒకటిగా ఏర్పరచుకొని హృదయమునకు తాకునట్టుగా నమస్కారం అన్నారు. హృదయ పూర్వకంగా దశేంద్రియములు అంకితము గావించి నీకు శరణాగతుడనవుతున్నాను అనే దృష్టిని అభివృద్ధి పరుస్తూ వచ్చాడు అక్రూరుడు.

అర్చనం, పృథుచక్రవర్తి షోడశోపచారముల చేత దైవమును ప్రసన్నుని గావించుకొని తనయొక్క మనోభీష్టమును నెరవేర్చుకున్న వ్యక్తి. ఈ అర్చనమునందు అంగార్చన మనేది పృథు చక్రవర్తి ప్రధానముగా ప్రపంచమునకు చాటుతూ వచ్చాడు. నేత్రకమలం సమర్పయామి. హృదయ కమలం సమర్పయామి. హృదయమును, సర్వఇంద్రియములను కమలములతో పోల్చి భగవంతునికి అర్పితము గావించినాడు. కానీ కలిప్రభావము ఈనాడు నేత్రకమలం సమర్పయామి అనటం పుష్పం వేయటం. నేత్రములు ఆ దృష్టిని అభివృద్ధి పరచుకోటం లేదు. నేత్ర కమలం సమర్పయామి అనగా మన దృష్టిని ఒక దైవదృష్టిగా తప్ప అన్య దృష్టిగా మనము అర్పితము గావించుకోరాదు. శ్రోత్రకమలం సమర్పయామి అనగా చెడ్డ విషయములు వినకూడదు. దైవచింతనను, పవిత్రమైన విషయములు, పరోపకార సంబంధమైన విషయములు వాటిని మాత్రమే మనం శ్రవణం చేయాలి. వీటి నిమిత్తమై నేను అంకితం గావించుకుంటున్నాను. అనే తత్త్వాన్ని పెంపొందించుకోవాలని దీని అంతరార్థము. ఇట్టి పవిత్రమైన అంగకూటమిని అర్పితము గావించుకొని జగత్తుకు అర్చనము ప్రధానమైన సార్థక మార్గమని ప్రబోధించినవాడు పృథు చక్రవర్తి.

దాస్యము. ఇది హనుమంతుడు భావించుకున్న పవిత్రమైన సేవ. హనుమంతుడు గొప్ప

sri sathyasai vachanamrutam

గుణవంతుడు. ఇటువంటి బలవంతుడైన, గుణవంతుడైన హనుమంతుడు అహంకారమునకు ఏమాత్రము అవకాశమునందించక నిరంతరము రామదాసుడను అని ఎంతో వినయ విధేయతలను ప్రకటించాడు. ఈనాటి మానవునకు ఎట్టి బలము, ఎట్టి స్థితి లేకపోయినప్పటికిని అహంకారమనే బలము అభివృద్ధి గావించుకుంటున్నాడు. అశోక వనములో ప్రవేశించిన హనుమంతుని చూసి లంకాపురవాసులంతా అయ్యా! నీవెవరని ప్రశ్నించారు. అక్కడ కూడను దాసోహం కోసలేంద్రస్య నేను శ్రీరామచంద్రుని దాసుడనని అడ్రస్సు ఇచ్చుకున్నాడు. ఎటువంటి పరిస్థితుల యందు, విరోధులయందు కూడను తన విశ్వాసమును, వినయ విధేయతలను ప్రకటిస్తూ వచ్చినటువంటి రామదాసుడు హనుమంతుడు. నిరంతరము రామసేవ తప్ప అన్య సేవనాశించేవాడు కాదు. సేవకాభావమునందు హనుమంతుని మించినవాడు జగత్తులో కానరాడు. ఈ దాసత్వములోపల హనుమంతునికి మించిన వ్యక్తులు మరొకరు లేరు.

ఇంక ఏడవది స్నేహం. అర్జునుడు. నిరంతరము కృష్ణ స్నేహము తప్ప అన్యస్నేహములు తాను ఏమాత్రము కోరినవాడు కాదు. స్నేహమనగా ప్రేమ అనికూడను ఒక అర్థము. తన ప్రేమ స్వరూపము కృష్ణునిపైన ఇమిడ్చిన వ్యక్తి. కనుక సమస్త శక్తులు సాధించినవ్యక్తి. అర్జున, ఫల్గుణ, పార్థ కిరీటి శ్వేతవాహన బీభత్స జయకృష్ణ సవ్యసాచి ధనుంజయః అని ఇటువంటి బిరుదులనంతా పొందిన మహావీరుడు శూరుడు పరమభక్తుడు. కనుక భగవద్గీతయందు కూడను

**యత్రః యోగీశ్వరః కృష్ణో యత్రపార్థోధనుర్ధరః**
**తత్ర శ్రీర్విజయో భుతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.**

ఎక్కడ కృష్ణుడో అక్కడ అర్జునుడు ఉంటున్నాడు. ఈ కృష్ణార్జునులు ఉండిన ప్రదేశములో శ్రీ విజయ విభూతి. అర్జునుడు చిత్తశుద్ధి కలిగిన వ్యక్తి. అర్జునుడనగా నిర్మలమని అర్థము. పవిత్రమైన హృదయమని అర్థము. ఎప్పుడిది పవిత్రమవుతుంది. భగవంతుని సన్నిధియే పెన్నిధిగా భావించుకున్న హృదయము పవిత్రంగా ఉంటుంది. రుద్ర భూమియందు, భద్ర భూమియందు కూడను కృష్ణునియొక్క సన్నిధి తప్ప కృష్ణునియొక్క ఆనందము తప్ప, కృష్ణుని బలము తప్ప అన్య బలములు అర్జునుడు ఆశించలేదు. ఏదో మానవ స్వభావముచేత అప్పుడప్పుడు కొంచెం

అహంకారము తలయెత్తినప్పటికి తాను కృష్ణుని స్మరించి కరిష్యే వచనం తవ నీయొక్క ఆజ్ఞను నేను శిరసావహించి నాపనులలో నేను పాల్గొంటాను అన్నాడు. నీ ఆజ్ఞను శిరసావహించే వ్యక్తినేగాని ఉల్లంఘించే వాడను కానన్నాడు. కనుకనే

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీమాం నమస్కురు**
**మామే వైష్యసి సత్యం తే ప్రతి జానే ప్రియోసిమే.**

అర్జునా! ఇప్పుడు నావు నా భక్తుడవు. కేవలము భక్తుడు మాత్రమే కాదు. మిత్రుడవన్నాడు. ఇలాంటి పరమభక్తుడైన, మిత్రుడైనవాడు అర్జునుడు. భగవంతునితో స్నేహము సంపాదించుకోవటమే ప్రపంచమున ప్రధానమైన మార్గమని బోధించిన వ్యక్తి అర్జునుడు.

**ఆత్మ నివేదనం**

ఇంక తొమ్మిదవది ఆత్మనివేదనం. అతనే ఈనాటి కథానాయకుడు. ఈనాటి పవిత్ర దినమునకు తాను ప్రధాన పురుషుడు. అతనే బలిచక్రవర్తి. భగవంతుడా! నావల్లఏమిటి ఉన్నది. సర్వమూ నీవే అనే ఆత్మార్పిత భావముతో తనను తాను అర్పితము గావించుకున్న వ్యక్తి బలిచక్రవర్తి. బలిచక్రవర్తి వామనమూర్తిని ప్రేమతో పిలుస్తున్నాడు. రమ్మా! ఓ వటువా! లెమ్మా నీ వాంఛితంబు లేదనకిత్తున్. ఓ! వామనమూర్తీ! రమ్ము. ఓ మహానుభావా! నీ చరణములు నాచేతికియ్యి. నీ పాదములు కడిగి పాదతీర్థమును నాశిరస్సునందు ఉంచుకొందును అన్నాడు.

శుక్రాచార్యుడు సమస్తం ఎరిగిన బ్రాహ్మణుడు. ఇతను బలిచక్రవర్తి పురోహితుడు. మహాపండితుడు. ఇతను వామనమూర్తి కేవలము విష్ణుమూర్తి స్వరూపమని గుర్తించినవాడు. కాన అడిగిన దానిని ఇచ్చుటకు నీవు సంసిద్ధుడుగా ఉండకూడదని బలిచక్రవర్తికి ఎంతయో బోధించాడు. శ్రీమహావిష్ణువే ఈ స్వరూపమును ధరించి నీ చెంతకు చేయి చాచుతూ వచ్చాడు. అతను త్రివిక్రముడు. సర్వస్వము అతను అపహరించగలడు. కనుక అతను అడిగిన దానిని ఇవ్వవద్దని బోధించాడు. బలిచక్రవర్తిది ఎంతటి గొప్ప హృదయమో చక్కగా యోచించుకోవచ్చు. సాక్షాత్ భగవంతుడే చేయి చాచి బలి చక్రవర్తీ! ఇమ్మని అడిగినప్పుడు అల్పుడనైన నాహస్తము పరమాత్ముని హస్తముపైన ఉండటం ఇంతకంటే మహాభాగ్యము నాకేమి కావాలి. భగవంతుని హస్తము క్రింద నాహస్తముపైన ఇదే మహాభాగ్యము. ఏమైనా కానిమ్ము నేను సర్వస్వము

srisathyasaivachanamrutam

అర్పితము గావిస్తానని గురువాజ్ఞను కూడను తిరస్కరించాడు. భగవన్మార్గమునందె వరైనా సరియే తిరస్కరించమని వేదము బోధించింది.

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అని ప్రధానమైన సూత్రములు భారతీయ శాస్త్రములో కాని భగవంతునికి ఎడబాటు కలిగించే విషయములో పాల్గొన్నప్పుడు తల్లినైనా ధిక్కరించమని భరతుడు కైకను ధిక్కరించి వెళ్లాడు. తండ్రి హరి చింత చేయకూడదని శాసించినప్పటికి ప్రహ్లాదుడు తండ్రి ఆజ్ఞను తిరస్కరించి హరిచింతనలో లీనమయ్యాడు ఆ పరమభక్తుడు. తన అర్పితమునకు అడ్డుతగిలిన శుక్రాచార్యులను గురువైనా కూడను ధిక్కరించి తన సర్వస్వమును భగవంతునికి అర్పితము గావించుకున్నాడు బలిచక్రవర్తి. సోదరుడైనప్పటికిని తనకు భగవంతునికి అడ్డుతగిలినప్పుడు, దూరము చేయటానికి ప్రయత్నించినప్పుడు విభీషణుడు రావణుని ధిక్కరించి రాముని చేరుకున్నాడు. పతేగతి అని భావించుకున్న స్త్రీలయొక్క తత్త్వాన్ని కూడను భగవంతునకు తనకు ఉండిన సంబంధ బాంధవ్యమునకు అడ్డు తగిలినప్పుడు పతిని కూడను ధిక్కరించ వచ్చునని తులసీదాసు వల్ల తెలుసుకొని మీరా మహారాణాను వదలి ద్వారక చేరిపోయింది. భగవంతునికి భక్తునికి ఉండిన సంబంధ బాంధవ్యమునకు ఎవ్వరూ అడ్డు తగులుటకు వీలుకాదు. అట్టి సన్నిహిత సంబంధము ఏర్పరచుకొని వారి ఆనందమునందే తన జీవితమును అంకితము గావించుకోవటమే స్నేహమునకు అర్థము.

బలి బక్రవర్తి మహాభక్తుడు. తన ప్రజలకు ఎట్టి అననుకూలములు సంభవించకుడా వారిక్షేమమే తన క్షేమముగా భావించి ఏవిధమైన ఇక్కట్లు కలుగకుండా సుభిక్షముగా రాజ్యమేలుతూ వచ్చాడు. ప్రజలనగా బలిచక్రవర్తి తన దేహమునందున్న సర్వాంగములుగా భావించాడు. ఆనాటి ప్రజలు కూడను ఈబలిచక్రవర్తిని సర్వాంగములు కూడిన దేహములో గుండెగా విశ్వసించెడివారు. దేహమే దేశము. ఈ దేశము ప్రజలలో ఉండిన గుండెనే బలి చక్రవర్తి. ఈ సన్నిహిత సంబంధ బాంధవ్యమును ప్రజలంతా మెచ్చుకున్నారు. బలిచక్రవర్తి రాజ్యములో భిక్షగాడు ఎక్కడా కనుపించేవాడు కాదు. సకాలములకు వర్షము కురిసి చక్కని పంటలుపండి దేశము నిరంతరము చక్కగా కళ్యాణకరముగా నిలుస్తూ ఉండేటువంటిది. ఇప్పటికిని కేరళ రాజ్యము పచ్చగా ప్రకృతి యొక్క సౌందర్యముగా కనుపిస్తుంది. అట్టి పవిత్రమైన

srisathyasaivachanamrutam

ప్రదేశము కనుకనే భగవంతుడు తాత్కాలికమైన అవతారములు మూడింటిని దాల్చాడు కేరళ రాజ్యములో. వరాహ, నారసింహ, వామన అవతారములు తాత్కాలికమైనవేగాని ఒక్క కుటుంబమును ఉద్ధారము గావించి సార్థకము గావించుకునే నిమిత్తమై సంకల్పించుకున్నదే ఈ దివ్య సంకల్పములు. హిరణ్యాక్షుని తరింపచేసే నిమిత్తము వరాహావతారము ధరించాడు. హిరణ్యకశిపుని తరింపచేసే నిమిత్తమై నారసింహావతారము ధరించాడు. బలిచక్రవర్తిని తరింపచేసే నిమిత్తము వామన రూపము ధరించాడు. ఈ ముగ్గురు ఒక్క కుటుంబములో ఉండినవారే.

**భగవంతుని లీలలు ఎవ్వరికీ అర్థము కావు**

హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు సోదరులు. వీరే జయవిజయులు. నిరంతరము భగవత్ సన్నిధినే పెన్నిధిగా భావించి నిరంతరము నామచింతన సలుపుతున్నటువంటివారు. పెద్దలను ధిక్కరించి అహంకారము చేత, మునులను అవమాన పరచటం చేత రాక్షస జన్మము ధరించవలసి వచ్చింది. ఎక్కడ ఉండినప్పటికీ అహంకారము ప్రవేశించరాదు. ఎట్టి వైద్యమునకైనా కాని రోగములు నివారణ కావచ్చుగాని అహంకారమనే రోగము ఎట్టి వైద్యమునకు నివారణకాదు. కనుక అహంకారమనే రోగమునకు గురికారాదు మానవుడు. జయవిజయులైనప్పటికీ కట్టకడపటికి రాక్షస జన్మ ధరించవలసి వచ్చింది. దీనికి మహావిష్ణువు ద్వారపాలకులమని ఉండిన అహంకారమే మూలకారణము. అట్టి అహంకార ఫలితమే రాక్షస జన్మము. అట్టి హిరణ్యకశిపుని కుమారుడే ప్రహ్లాదుడు. తండ్రి హరిద్వేషి. కుమారునికి హరిప్రీతి. ఈ ప్రహ్లాదుని కుమారుడే విరోచనుడు. మహాభక్తుడైన ప్రహ్లాదునకు మహాదుష్టుడైన కుమారుడు పుట్టాడు. ఈ విరోచనుని కుమారుడే బలిచక్రవర్తి. అతను తిరిగి పరమభక్తుడు.

**చిత్రంబులు త్రైలోక్య ప**
**వి్త్రంబులు భవలతా లవిత్రంబులు స**
**న్మిత్రంబులు మునిజన వన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్**

భగవంతుని లీలలు ఇట్టివి అట్టివి అని వర్ణించుటకు వీలుకాదు. దుష్టుని గర్భమునందు



sri sathyasai vachanamrutam

పవిత్రుడు, పవిత్రుని గర్భమునందు దుష్టుడు ఈ విధముగా రావటానికి ఎన్నో కారణములు ఉంటుంటాయి. భగవంతుడు చేసే ఏచిన్న కార్యము నందును కారణములేని కార్యము ఎక్కడా ఉండదు. తాను ఇట్టి కర్మలే ఆచరించకుండిన జగత్తే నిల్చి ఉండదు. Prof చెప్పాడు.

**నమో పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన**
**నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవచ కర్మణి.**

భగవంతుడే ఇట్టి కర్మలు ఆచరించకుండిన జగత్తే క్షీణించిపోతుంది. స్తంభించి పోతుంది. కారణాన్ని గుర్తించుకోలేని కర్మజీవులు భగవంతుని సృష్టిని అనేక రకములుగా తూలనాడుతూనో లేక విమర్శిస్తూనో ఉంటుంటారు. బలి చక్రవర్తి తత్త్వము మహా పవిత్రమైనది. దివ్యమైనటువంటిది. నవ్యమైనటువంటిది. ఆ ప్రజలకు ఆ ప్రభువుకు ఉండిన ప్రేమతత్త్వముచేతనే ప్రజలు ప్రభువును వీడలేకపోయారు. ప్రభువు ప్రజలను వీడలేకపోయాడు. కనుకనే వామనుని యొక్క ఆజ్ఞ తీసుకొని బలిచక్రవర్తి ప్రజలకు ఒక వాగ్దానమిచ్చాడు. ఓ! ప్రియమైన ప్రజలారా! మిమ్ములను ఎడబాసి నేనుండలేను. నన్ను ఎడబాసి మీరు ఉండలేరు కనుక ప్రతి సంవత్సరము నేను కేరళ దేశమునకు వచ్చి మీకు దర్శనమిచ్చిపోతానని వాగ్దానము చేశాడు. అదే ఈ ఓణం. ప్రతి సంవత్సరము బలిచక్రవర్తి అంతర్భావము చేతనో బహిర్భావము చేతనో కేరళ ప్రజలను సందర్శించే నిమిత్తమై అక్కడ సాక్షాత్కరిస్తాడని వారల విశ్వాసము. మానవత్వములో ఉండిన ఈ పవిత్రతను, ఈ దివ్యత్వమును గుర్తించుకోవటం, చాలా కష్టము. ఇది ఎవరికి సాధ్యమవుతుంది. కేవలము సర్వజ్ఞుడైన దివ్యత్వమును విశ్వసించిన వారికే సాధ్యమవుతుంది.

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం స్నేహమాత్మనివేదనం**

ఈ నవవిధ మార్గములు సామాన్యమైన భక్తికి పోల్చుకుంటూ వచ్చారు. కాని ఇది సామాన్యమైనది కాదు. సమస్తము ఇమిడి ఉండేది. ఈ సమస్తములోనే తన స్వరూపము కూడను ఉంటున్నది. పరమాత్మను పొందినటువంటి భక్తులందరు ఈ మార్గమును అనుసరించి సార్థకము చెందారు.

**అనన్యభక్తి**

srisathyasaivachanamrutam

ఇంక రెండవది అనన్యభక్తి. అనగా భగవంతుని కంటె అన్యమైనది జగత్తులో మరొకటి లేదు. అనే విశ్వాసముచేత భగవత్ స్వరూపకముగా సర్వమూ విశ్వసించటము.

**హరిమయము విశ్వమంతయు**
**హరి విశ్వమయుండు సంశయము పనిలేదా**
**హరి మయముగాని ద్రవ్యము**
**పరమాణువు లేదు పరికించినచో**

సమస్త పదార్థములు విష్ణు స్వరూపమే. విశ్వం విష్ణు స్వరూపం. ఏకం సత్ విప్రా బహుధావదంతి ఉన్నది ఒక్కటే ఇట్టి భావము చేత దివ్యత్వమును స్మరించుతూ తన యొక్క జీవితము సార్థకము గావించుకోవటమే ఈ అనన్య భక్తి. ఏది చూసినా దైవ స్వరూపమే. ఏది చేసినా దైవసేవయే. ఎక్కడికి నడచినా దైవప్రదక్షిణయే. సర్వ కర్మలు భగవదర్పితము గావించుకొని తన జన్మము సార్థకము గావించుకోవటానికి ఏకాత్మభక్తిగా భావిస్తూ వచ్చారు అనన్య భక్తిని. కానీ ఇది అందరికీ అంత సులభసాధ్యముకాదు. చెప్పవచ్చు కోటి చెయ్యరు ఒక్కటి. భగవంతుడు సర్వవ్యాపకుడని చెప్పవచ్చు. అది సులభమే. సర్వవ్యాపకుడైన భగవంతుని అనుభవించటం చాలాకష్టం. రామ భక్తులు జగత్తంతా ఉన్నారు. కానీ రామ ప్రీతికి అర్హుడైనవాడు ఒక్కడైనా కనిపించటం లేదు. రా అనగా ఆత్మ, మ అనగా జీవుడు. రామ అనగా రెండింటికి ఏకత్వమే నిజమైన రామతత్త్వము. జీవాత్మల ఐక్యాను సంధానమే రామతత్త్వము. ఇట్టి అంతరార్థమును గుర్తించి వర్తించే వ్యక్తులు ఈనాడు చాలా అరుదు. అదే విధముగనే భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడని, సర్వవ్యాపకుడని, సర్వజ్ఞుడని భావించవచ్చును. తప్ప దానిని అనుభవించటము కష్టము. చెప్పేది చేసేటువంటివాడే నిజమైన భక్తుడు. దీనినే త్రికరణ శుద్ధియని చెప్పుతూ వచ్చారు.

**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనం**
**మనస్యన్యక్ వచస్యన్యక్ కర్మణ్యన్యక్ దురాత్మనం**

దైవము సర్వత్రా ఉంటున్నాడు. సర్వ విషయములందును తాను భవద్విషయమును గుర్తించిన వ్యక్తి అనన్య భక్తుడు.



srisathyasaivachanamrutam

## ఏకాంత భక్తి

అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థితః, ఏ నారాయణుడు సర్వత్ర వ్యాపించి ఉంటున్నాడో, బహిర్ముఖములో ఉండిన నారాయణుడే నా అంతర్ముఖములో ఉంటున్నాడనే గాఢమైన విశ్వాసము కలిగినవాడు ఏకాంతభక్తుడు. లోపల వెలుపల సర్వత్రా ఉండినటువంటివాడే నాయందు కూడా ఉంటున్నాడు. సర్వత్రా ఉండిన భగవంతుడు సమిష్టి స్వరూపుడు. నాయందున్న భగవంతుడు వ్యక్తి స్వరూపుడు. వ్యక్తికి సమిష్టికి ఉండిన వ్యత్యాసము మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ఎట్టిదనగా ఒక వృక్షము ఉన్నది. అది ఒక వృక్షమనే చెప్పవచ్చును. అదివ్యక్తి. అలాంటి వృక్షములు కొన్ని వందలు ఉండవచ్చును. అదేవనమని అంటారు. వృక్షము వనము కాదు. వనము ఒక వృక్షము కాదు. అనేక వృక్షములతో కూడినది వనము. అదే సమిష్టిస్వరూపము. ఒక ఇల్లుఉంటే ఒక ఇల్లు అంటాము. అనేక గృహములు చేరినది గ్రామమని చెప్పవచ్చును. ఇంటికి గ్రామమునకు, వ్యక్తికి సమిష్టికి ఉండిన వ్యత్యాసము. ఒక వ్యక్తి వ్యక్తిగా ఉండవచ్చును. కాని సమాజమని ఒకటి ఉంటుండాది. సమాజమనగా అనేక వ్యక్తుల చేరికయే. వ్యక్తులు లేక సమాజము లేదు. ఆ సమాజము సమిష్టి. ఒకడుగా ఉండినవాడు వ్యక్తి. కాబట్టి సమిష్టిగా ఉండిన ఆత్మస్వరూపుడే భగవంతుడు. అట్టి భగవంతుడైన సమిష్టి స్వరూపుడే నాయందు వ్యక్తి స్వరూపుడుగా ఉన్నాడు. వ్యక్తి లేక సమిష్టి లేదు అనే విశ్వాసము చేత ఏకాంతమైన భక్తిని అనుసరిస్తూ వస్తుంటాడు. కనుక ఎక్కడ చూసినప్పటికీ దైవభావమే. దైవస్వరూపమే.

అన్నింటికిని ఆధారము నామము. సమస్త సమస్యలు రూపుమాపి మానవునకు శాంతిభద్రతలందించేది ఒక్క నామమే. ఈ నామమునకు ఉండిన మాధుర్యము మరియే పదార్థమునకు లేదు. మధురాతి మధురమైనది భగవంతుని నామము. నామము వేరు రూపము వేరుకాదు. ఈ రెండింటికి ఉన్న సన్నిహిత సంబంధ బాంధవ్యమును మనము విచారించాలి. రూపము కొన్న వస్తువు. నామము వస్తువును కొనగలిగే వస్తువు. ఏది ఉంటే మనము ఇంకొక వస్తువును కొనవచ్చును? ధనము చేతిలో ఉంటే ఏవిస్తువునైనా మనము కొనవచ్చును. కనుక ప్రతిమానవుడు నామమనేధనమును అభివృద్ధి పరచుకోవాలి. ఈ నామము చేతనే మనము భజనగావించుకుంటూ నామచింతనచే ఈ నామికి అర్పితము గావించుకోవాలి. నామినామము

srisathyasaivahini.org

రెండు అవినాభావ సంబంధము. అన్యోన్య ఆశ్రయము. ఇట్టి దివ్యమైన భావాన్ని ప్రతిభక్తుడు చక్కగా విచారించాలి. ఇట్టి పరమ తత్త్వాన్ని పొందటానికి ఒకే మార్గము, మానవతా విలువలు పెంచుకోవాలి. ఇవే చతుర్విధ సాధనలు అన్నారు. మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష. ఇవి నాలుగు చిన్న పదములుగా ఉంటున్నవి. కాని సమస్త మానవతా విలువలనీ ఇందులోనే ఇమిడి ఉంటున్నాయి.

**సత్సంగం కలిగియుండండి**

మైత్రి దివ్యమైన సంఘముతో మనము సంబంధము పెట్టుకోవాలి. భూమి పై మట్టి ఉంటున్నాది. ఈ మట్టిగాలితో friendship చేస్తే గగనము వరకు ఎగురుతుంది. నీటితో friendship చేస్తే గుంటలోకి దిగిపోతుంది. క్రిందికి దిగటానికి కాళ్లులేవు. పైకి ఎగరటానికి రెక్కలు లేవు. స్నేహముయొక్క సంబంధమే పైకి పోవటానికి క్రిందికి పోవటానికి సంబంధము. దుష్టుల సంఘము అట్టడుగుకు తీసుకుపోతుంది. అధఃపతనము చేస్తుంది. సత్సంగము ఉన్నత స్థాయికి తీసుకువెళుతుంది. కనుక మైత్రి అనగా పవిత్రమైన, సన్నిహితమైన స్నేహము మనకు ఏర్పడాలి. ఎవరు మనకు నిజమైన మిత్రుడు. భగవంతుడే నిజమైన మిత్రుడు. అతను friendship ను మనం డెవలప్ చేసుకోవాలి. ఈనాటి మిత్రులంతా కూడను pocket లో money ఉంటుండాది. Father స్థితి బాగుంటున్నాది. చూసిన వారందరు hellow hellow అందరు friends అయిపోతుంటారు. Father రిటైరు అయిపోయినాడు. pocket ఖాళీ అయిపోయింది. ఎవ్వరూ హలో చెప్పరింక.

చెరువులో నీరు ఉండినంతవరకు వేల కప్పలు చేరుతాయి. చెరువులో నీరు ఎండిపోతే ఒక్క కప్ప అయినా అక్కడ ఉండదు. ఇది ఈనాటి స్నేహము. కానీ భగవత్ స్నేహమట్టిది కాదు. ఎప్పుడూ వెంటనే జంటనే ఇంటనే కంటనే ఉంటుండి కాపాడుతూ ఉంటాడు. నీ బంధువులుగాని, నీ మిత్రులుగాని వల్లకాటి వరకు వస్తారు. అంతవరకు తప్ప మన కష్ట నష్టము లేమాత్రము గుర్తించరు. భగవంతుడు నిరంతరము వెంటనే ఉంటాడు. అట్టి స్థితిని స్నేహమని మనం గుర్తించాలి. అట్లని ప్రాపంచికమైన వ్యక్తులతో ద్వేషము పూనరాదు. అద్వేష్టా సర్వభూతానాం. ఎవరియందు ద్వేషము మనము అభివృద్ధి చేసుకోరాదు. స్నేహము ఉండాలి.

srisathyasaivachanamrutam

ద్వేషము ఉండకూడదు. ఇది ఏరీతిగా మనం పెంచుకోవాలి? చాలా simple hellow! how are you. Good bye good bye అంతే. అమితంగా మనం పెంచుకోరాదు. అమితంగా పెంచుకోవటంచేత మతి కూడా భ్రమిస్తుంది. మాటలు కూడను మంచిగా నీవు పలుకు. You cann't always oblige but you can speak always obligingly. ఈ విధముగా స్నేహమును అభివృద్ధి గావించుకోవాలి.

రెండవది కరుణ. కరుణ అనగా ఏమిటి? హృదయాన్ని కరగించుకోవాలి. బీదలను చూసినప్పుడు, దీనులను చూసినప్పుడు, దిక్కులేని వారిని చూసినప్పుడు మన హృదయము కదలాలి, కరగాలి. అలాంటి కరిగే కరుణను మనం అభివృద్ధి పరచుకోవాలి. ఆ కరుణచేత మానవత్వమనేది వికసిస్తుంది. సూర్య కిరణములచేత కమలములు ఏరీతిగా వికసించునో కరుణ కిరణముల చేత మన హృదయ కమలము కూడా వికసిస్తుంది. కరుణే మన కిరణములు. మన హృదయమే కమలము. కరుణ అనేదాన్ని తెలుసుకున్నప్పుడే హృదయ కమలం వికసిస్తుంది. ప్రతివ్యక్తియందు దైవ భావన పెట్టుకున్నప్పుడే మనకు కరుణ అభివృద్ధి పొందుతుంది.

ముదిత అనగా పవిత్రమైన కార్యములందు, పుణ్యకార్యములందు శ్రద్ధ భక్తిని అభివృద్ధి పరచుకోవాలి. కానీ కలిప్రభావము చేత ఏదైనా చక్కని సమావేశము జరుగుతూ ఉంటే, భగవంతునియొక్క ఉపన్యాసములు జరుగుతూ ఉంటే వారికి ఎక్కడలేని నిద్ర ఉట్టి పడుతుంది. లేకపోతే ఎక్కడెక్కడో పాడు చింతలు వచ్చి నీ తలలో చేరి పోతుంటాయి. కన్నులతో అటూ ఇటూ చూడటమైనా కొంతవరకు అభివృద్ధి పరచుకుంటారు. ఏకాగ్రత అనేది వారి దురదృష్టము చేత ఏర్పడటం లేదు. కనుక మంచి కార్యములందు, పవిత్రమైన కార్యములందు, పుణ్యకార్యములందు, పరోపకార సంబంధమైన కార్యములందు మన హృదయమును అభివృద్ధి పరచుకోవటమనే తత్త్వమును ముదిత అన్నారు. ఇప్పుడు కలిప్రభావము ఎలా ఉందంటే ఎవరైనా వచ్చి దానం అడిగినప్పుడు పదిరూపాయలు ఇస్తానంటాడు. వాగ్దానము చేస్తాడు. లోపలికి వెళ్లేటప్పటికి వానికి ఎందుకు పదిరూపాయలు ఐదు రూపాయలు ఇస్తే చాలు అని మార్పు వస్తుంది. మరి పెట్టి తీసి డబ్బు తీసేటప్పటికి ఐదు రూపాయలెందుకు ఒక రూపాయి ఇస్తే చాలు అని మార్పు వస్తుంది. ఇలాంటి చపలచిత్తులకు ఏనాటికి కరుణగాని దయగాని

srisathyasaivahini.org

వారిలో అభివృద్ధి కాదు. అయ్యో! పదిరూపాయలు ఇస్తానన్నాను ఈ పదిరూపాయలతో వానికేమి పని అవుతుంది పోనీ ఇంకో పది రూపాయలు ఇస్తానని ఆ ప్రేమతత్త్వాన్ని పెంచుకుంటూ పోయినప్పుడే ఆ హృదయము కూడను ఆనందమును అనుభవింప చేసుకుంటుంది. స్నేహము, కరుణ ఈ రెండు ముదితతో చేరినప్పుడే త్యాగము కూడను అభివృద్ధి అవుతుంది.

ఇంక ఉపేక్ష. ఉపేక్ష అనగా ఏమిటి? స్నేహము, కరుణ, ముదిత ఈ మూడు ఏకమై ఉంటుండాలి. మంచి వారిపైన రాగముగాని, దుష్టులపైన ద్వేషముగాని ఉండరాదు. రాగద్వేష రహితమైన తత్త్వమునే ఉపేక్ష అన్నారు. ఇష్టాయిష్టములను రెండింటిని సమత్వముగా భావించటము. అప్పుడే మానవతా విలువలు మనలో అభివృద్ధి అవుతాయి. కనుక ఇట్టి మానవతా విలువలను మనం అభివృద్ధిగావించుకోవాలంటే మొట్టమొదట దైవవిశ్వాసమును మనం పెంచుకోవాలి. ఇలాంటి పవిత్రమైన విషయముల లోపల శ్రద్ధను మనం చూపవచ్చు.

ఈనాడు ఓణం అని కేరళ దేశములో అన్ని మూలల జరుగుతున్నది. కానీ ఈ ప్రశాంతి నిలయములో జరిగే ఓణమే నిజమైన ఓణం. కారణ మేమనగా కేరళలో ఎవరి ఇంటిలో వారు పాయసమో పరమాన్నమో చేసుకొని పండుగ చేసుకొని ఆనందిస్తారు. అక్కడ అందరూ చేరి ఈ ఓణమును అనుభవించేది కేరళలో లేదు. ఏదో ఒకరిద్దరు బంధువులు చేరి పండుగ చేసుకోవచ్చు. ఇక్కడ సమిష్టి స్వరూపమైన ఓణము. కేరళ ప్రజలందరు ఏకంగా చేరి వారిఇంటిలో చేసుకున్నట్టుగా ఆనందాన్ని అనుభవించటము ఇది చాలా అదృష్టమైనది. ఇది చాలా గొప్పది. తమ స్టేట్‌లో సమిష్టి స్వరూపకంగా చేసుకోవటం జరుగదు. ఇది నిజమైన దైవసన్నిధి. దైవముయొక్క ఆనందమును అభివృద్ధి పరచుకోవటానికి తగిన కారణము. కాని ఇది ఒక గొప్ప విశేషమైన ఓణంగా భావించాలి. సమిష్టి స్వరూపుడైన విష్ణు స్వరూపాన్ని హృదయంలో చిత్రించుకున్నట్టుగా ఉంటుంది. కనుక మీరు భగవంతుని నామమును ప్రధాన నావగా భావించుకొని ఈ జీవిత ప్రవాహమునందు ఈ నావ నాధారం చేసుకుని దాటి ధన్యులు కావాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నాప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేది. 12-09-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivahini.org